విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విలేకరులుగా పనిచేయడానికి ఆహ్వానిస్తున్నాము. సామాజిక దృక్పదం, అవినీతి, అక్రమాలపై అక్షర గళాన్ని వినిపించే దమ్మున్న విలేకరులు 'అక్షర వెలుగు' తెలుగు దిన పత్రికలో పని చేయడానికి ఈ క్రింది మేయిల్ అడ్రస్‌కు వివరాలను పంపండి

Mail: aksharavelugudaily@gmail.com

8985893382

www.aksharavelugu.com

# అక్షర వెలుగు

జనం కోసం - మన అక్షరం

తెలుగు దిన పత్రిక

ఆది వారం

1.5.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-66

పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్ :
గోసుకొండ పృధ్విరాజు

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# ఇంగ్లీష్‌లోనే కోర్టు వ్యవహారాలు సరికాదు

## స్థానిక భాషలతోనే కోర్టులపై సామాన్యుల్లో విశ్వాసం • న్యాయసదస్సులో ప్రధాని మోడీ ఉద్ఘాటన

- సామాన్యులకు అర్థమయ్యేలా న్యాయభాష ఉండాలి
- చట్టాలు అమలయితే కోర్టుల జోక్యం ఉండదన్న జస్టిస్ ఎన్వీ రమణ






**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** న్యాయ భాష సామాన్యులకు అర్థమయ్యేలా ఉండాలని ప్రధాని మోదీ అన్నారు. కోర్టుల్లో న్యాయ వ్యవహారాలన్నీ ఇంగ్లిష్‌లోనే జరుగుతున్నాయని, అలాకాకుండా స్థానిక భాషలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. స్థానిక భాషలతో సామాన్యులకు న్యాయవ్యవస్థలపై విశ్వాసం పెరుగుతుందనన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరుగుతున్న సీజేలు, సీఎంల సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సంయుక్త సదస్సు కొనసాగుతోంది. శనివారం ఉదయం విజ్ఞాన్ భనవ్‌లో మొదలైన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజ్జు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ప్రధాన సమస్యల పరిష్కారంలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమైనదని చెప్పారు. న్యాయవ్యవస్థ బలోపేతానికి మరిన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. సామాన్యులకు చట్టంలోని చిక్కులు కూడా తీవ్రమైన అంశమని చెప్పారు. సుప్రీంకోర్టుతో పాటు హైకోర్టు, జిల్లా కోర్టులు బలోపేతమవ్వాలని ప్రధాని సూచించారు. న్యాయవ్యవస్థలో ఖాళీలను భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. అత్యాధునిక సాంకేతికత సాయంతో మరిన్ని సంస్కరణలు రావాలన్నారు. డిజిటల్ ప్రపంచంలో సాంకేతికత ప్రధాన వనరుగా మారిపోయిందని చెప్పారు. సీఎంలు, హైకోర్టు సీజేలు డిజిటల్ ఇండియా ప్రగతిలో కలిసిరావాలని కోరారు. దేశంలో డిజిటల్ లావాదేవీలు అసంభవమని చెప్పారు. కానీ నేడు దేశంలోని మారుమూల ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలు నడుస్తున్నాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు. న్యాయ వ్యవస్థ



మౌలిక సదుపాయాలను కూడా డిజిటలైజ్ చేయాలని పేర్కొన్నారు. దేశంలో అసంబద్ధంగా మారిన సుమారు 1800 చట్టాలను గుర్తించామని, వాటిలో 1450 చట్టాలను రద్దుచేశామన్నారు. కానీ రాష్ట్రాలు మాత్రం 75 చట్టాలను మాత్రమే రద్దు చేశాయని వెల్లడించారు. అనవసరమైన చట్టాలను రద్దు చేయడంలో రాష్ట్రాలు కూడా కీలకంగా ఉండాలన్నారు. ఆరేండ్ల తర్వాత హైకోర్టు సీజేలు, సీఎంల సంయుక్త సమావేశం జరుగుతున్నది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు పాల్గొన్నారు. రాష్ట్రం తరపున 2

## కాబూల్ ఆత్మహుతి దాడిలో 50మంది మృతి

### చెల్లాచెదురుగా పడ్డ మృతదేహాలు



**కాబూల్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** అఫ్ఘనిస్తాన్ లో మరోసారి బాంబు పేలుళ్లు విధ్వంసం సృష్టించాయి. రాజధాని కాబుల్‌లోని ఓ మసీదు వద్ద ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 50 మందికి పైగా మృతి చెందారు. కాబుల్‌లోని స్థానిక ఖలీఫా సాహిబ్ మసీదు వద్ద శుక్రవారంమధ్యాహ్నం రంజాన్ ప్రార్థనలు ముగించుకుని వెళ్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తి తనను తాను పేల్చుకుని ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ముందుగా 10 మంది గాయపడినట్లు తాలిబన్ ప్రభుత్వ అధికారులు ప్రకటించారు. అయితే సాయంత్రం వరకు మృతుల సంఖ్య 50కి పైగా పెరిగినట్లు వెల్లడించారు. మరో 100 మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. ఘటన తర్వాత ఎటు చూసినా చెల్లాచెదురుగా మృతదేహాలే కన్పిస్తున్నాయని ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. ఈ పేలుడు వెనుక ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ హస్తం ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. రంజాన్ నెల ప్రారంభమైన తర్వాత గత కొద్ది రోజులుగా అఎ÷-గాన్‌లో వరుస పేలుళ్లు కలకలం రేపుతున్నాయి. గత 10 రోజుల్లో వివిధ ప్రాంతాల్లో 11 ఉగ్రదాడులు సంభవించాయి. పదుల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. గతవారం మజర్ ఈ షెరీఫ్ పట్టణంలోని ఓ మసీదుపై జరిగిన బాంబు దాడిలో 33 మంది మరణించారు.

## తలసేమియాకు ఆరోగ్యశ్రీలో చికిత్సలు

- అవసరమైన బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు
- వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** తలసేమియా వ్యాధి బారిన పడిన పిల్లలకు ఆరోగ్యశ్రీలో చికిత్స అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉస్మానియా, నీలోఫర్, గాంధీ ఆసుపత్రుల్లో తలసేమియా రోగులకు చికిత్స అందిస్తోంది. 2

## బిజెపిని అందరూ కలసికట్టుగా ఎదుర్కోవాల్సిందే

- అప్పుడే విజయం సాధించడం సాధ్యం
- ప్రశాంత్ కిషోర్ అభిప్రాయం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** దేశంలో మూడో ఫ్రంటో, నాలుగో ఫ్రంటో ఎన్నికల్లో విజయం సాధించలేదని, బీజేపీని కనుక ఓడించాలనుకుంటే రెండో ఫ్రంట్‌గా ముందు కెళ్లడం తప్ప మరో మార్గం లేదని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మమతా బెనర్జీ పార్టీ టీఎంసీ థర్డ్ ఫ్రంట్‌గా అవతరించేందుకు మీరు సాయం చేస్తున్నారా? అన్న ప్రశ్నకు సమాధానంగా ఆయనీ వ్యాఖ్యలు చేశారు. 2

## ఆర్మీ చీఫ్‌గా జనరల్ మనోజ్ పాండే


### నరవాణె నుంచి బాధ్యత స్వీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** భారత ఆర్మీ చీఫ్‌గా జనరల్ మనోజ్ పాండే శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ భారత ఆర్మీ చీఫ్‌గా బాధ్యతల్లో వున్న జనరల్ ఎం.ఎం. నరవాణెళి శనివారం పదవీ విరమణ చేశారు. మూడేళ్ల పాటు పాండే ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇప్పటి వరకూ జనరల్ మనోజ్ పాండే ఆర్మీకి ఉప చీఫ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్ నుంచి మొదటి సారిగా ఆర్మీ చీఫ్‌గా ఎన్నిక కావడం ఇదే ప్రథమం. ఆర్మీ చీఫ్ కోసం కేంద్రం జైసింగ్ నయన్, అమర్‌దీప్ సింగ్ భిందర్, యోగేంద్ర దిమ్రి పేర్లను కూడా పరిశీలించింది. చివరకు జనరల్ మనోజ్ పాండే వైపు మొగ్గు చూపింది. జనరల్ పాండే ఫిబ్రవరిలో ఆర్మీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి, ఈస్టర్న్ ఆర్మీ కమాండ్‌కు నాయకత్వం వహిస్తూ, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ సెక్టర్లలో వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి భద్రత, రక్షణ బాధ్యతలను నిర్వహించారు.

## ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించరా !

### పాదయాత్రలో మండిపడ్డ షర్మిల



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** కేసీఆర్ హయాంలో ఉపాధి పథకం తీరు దారుణంగా ఉందని వైసిపి తెలంగాణ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఉపాధికూలీలను శ్రమదోపిడీకి గురి చేస్తు న్నారని మండిపడ్డారు. పని చేయించుకొని కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదు. కూలీలకు డబ్బు చెల్లించలేని స్థితిలో తెలంగాణ పాల కులు ఉన్నారా అంటూ నిలదదీశారు. ఇదేనా మంచి పాలన... అంతా దోచుకోవడమేనా మీ విధానమా అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి గ్రామంలో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పర్యటించారు. ఆమెను కలిసిన ఉపాధిహామీ కూలీలు తమ సమస్యలు 2

## ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టండి

- పదిహేను రోజులైనా ఎక్కడా కానరాని సేకరణ
- రైతుల ఇబ్బందులను దృష్టి పెట్టుకని సాగండి
- సిఎం కెసిఆర్‌కు లేఖ రాసిన బండి సంజయ్



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** తెలంగాణలో వడ్ల కొనుగోలు, కాంటాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావుకి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ బహిరంగలేఖ రాశారు. బీజేపీ తెలంగాణ శాఖ చేసిన అనేక ఉద్యమాలకు తలవొగ్గే మీరు వడ్లు కొనడానికి ముందుకు వచ్చారు. అందులో భాగంగానే రాష్ట్రంలో 2

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- మానసిక ఒత్తిడికి క్రీడలే ఉపవమనం
- మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. క్రీడలలో పాల్గొనడం వలన మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడమే కాకుండా ఆరోగ్యపరంగా ఎంతో దృఢంగా తయారవుతారని చెప్పారు. హైదరాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున విద్యార్థులకు శిక్షణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 2

## స్వేదం చిందిస్తున్న సింగరేణి కార్మికులు

- బొగ్గు లేకుంటే థర్మల్ విద్యుత్ లేదు
- కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి
- మేడే స్ఫూర్తితో వారికి అండగా నిలవాలి

**కరీంనగర్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మేడే అనగానే తెలంగాణలో సింగరేణి, ఆర్టీసీ కార్మికులే గుర్తుకు వస్తారు. అనేక సంస్థలు ఉన్నా ఈ రెండు సంస్థల్లో కార్మికులకు ఇంకా న్యాయం జగాల్సి ఉంది. ప్రధానంగా సింగరేణి కార్మికుల వల్లనే ఇవాళ బొగ్గు ఉత్పత్తి జరిగి విద్యుత్ రంగానికి కీలక భూమికను నిర్వహి స్తున్నారు. వీరు లేకుంటే థర్మల్ పవర్ లేదన్నది గుర్తించాలి. వృత్తిగతంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇందులో ఆరోగ్య సమస్య అతి ప్రధానమైనది. బొగ్గుబావుల్లో దిగి తమ ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గును వెలికి తీస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారి పోరాటం మరువలేనిది. ప్రపంచ కార్మిక దినోత్సవం స్ఫూర్తితో కార్మికులు మరింతగా ఉత్పత్తి క్షేత్రంలో పనిచేసేలా ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉంది. సింగరేణి యాజమాన్యం వేతన ఒప్పందాలను, కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మిక హక్కులను కాలరాస్తుందన్న విమర్శలు ఉన్నాయి. అలాంటివి లేకుండా ఆదాయవనరుగా ఉన్న కార్మికులను ఆదుకోవాల్సి ఉంది. కోల్ బెల్ట్ లో గెలిచిన టిఆర్ఎస్ ఎంపీలు సింగరేణి కార్మికులసమస్యల 3






## బండి సంజయ్‌ది పాదయాత్ర కాదు

- పాపాలను కడుక్కునే యాత్ర
- మేం తల్చుకుంటే కిషన్ రెడ్డి కూడా తిరగలేడు
- మీడియా సమావేశంలో బాల్క సుమన్ హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** బండి సంజయ్‌ది పాదయాత్ర కాదు.. పాపాలను కడుక్కునే యాత్ర అని తెలంగాణ బీజేపీ నేతలపై ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో 2



## మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** ఒక్కసారిగా పడిపోయాయని సంతోషించేలోపే.. కరోనా కేసులు నెమ్మదిగా పెరుగుదల కనిపిస్తోంది. గత 24 గంటల్లో 3,668 కొత్త కేసులు నమోదు అయ్యాయి. 50 మంది కరోనాతో మృతి చెందారు. శనివారం ఉదయం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. దేశ రాజధా నిలో ఢిల్లీ కేసుల పెరుగుదల కొనసాగుతోంది. భారత్‌లో నమోదైన మొత్తం 3,668 కేసుల్లో.. 1, 607 కేసులు, రెండు 3



## కెటిఆర్ వ్యాఖ్యలతో విమర్శల వెల్లువ

- సోషల్ మీడియా వేదికగా వైసిపి ఎదురుదాడి
- తప్పును సరిదిద్దుకున్న మంత్రి కెటిఆర్
- ఎవరినో నొప్పించడానికి కాదంటూ వివరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** తెలంగాణ మంత్రి కేటీఆర్.. ఏపీలో నెలకొన్న పరిస్థితులపై చేసిన కామెంట్లు పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. దీంతో 2



## ఈసారి అతిభారీ ఎండలు

- 50 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశాలు
- ఐఎండి తాజా హెచ్చరికలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** తీవ్రమైన వేసవితాపంతో జనాలు అల్లాడి పోతున్న వేళ ఐఎండీ చెమటలు పట్టించే హెచ్చరిక చేసింది. ఈ ఏడాది గరిష్ఠ ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెల్సియస్ దాటే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుత ఎండల తీవ్రత మే 2 వరకూ ఇదేవిధంగా కొనసాగుతుందని ఐఎండీ పేర్కొంది. సాధారణంగా మే నెలలో ఎండలు అధికంగా ఉంటాయి. కాబట్టి ఈ ఏడాది మే నెలలో 2

## సంపాదకీయం

# అణచివేతకు గురవుతున్న శ్రామికవర్గం

మేడే అనగానే గుర్తుకు వచ్చేది కార్మిక వర్గమే. వారు లేనిదే పరిశ్రమలు లేవు..జీవనం లేదు.. అయినా ఏటా మేడేలు జరుపుకుంటున్నా వారిని ఆదరించే తీరులో మాత్రం కృతజ్ఞత లేదు. వారిని నేటికి బానిసలు గానే చూస్తున్న తీరు దారుణం. ఇకపోతే దేశంలో కార్మికులను అణచివేసే రాక్షస యాజమాన్యాలు ఇంకా ఉండనే ఉన్నాయి. వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్నాయి. కార్మికసంక్షేమం అన్నది మేడిపండు చందంగా మారుతోంది. కార్మికులు తమ స్వేదాన్ని రక్తంగా చిందించి లాభాలు తెచ్చి పెడుతున్నా, నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు.ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకున్నా.. నేటికీ అవి అమలు కావడం లేదు. కార్మికుల పోరాటాల్లో నుంచి మేడే పుట్టి ఏటా మేడేలు జరుపు కుంటున్నా స్వేదం చిందిస్తున్న కార్మికులను ఇంకా బానిసలుగా చూస్తున్న ఘటనలు కోకొల్లలు. సర్వసంపదలు సృష్టించేది శ్రామిక వర్గం అన్నది గుర్తించడం లేదు. శ్రమజీవులు ప్రపంచ వ్యాప్తంగా తమ సత్తా ఏమిటో చాటారు. 8 గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పని గంటల హక్కు సాధించారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలర్పించారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. తమ డిమాండ్లపై నినదించిన వారిని తక్షణం ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. విద్యా,ఉద్యోగ సౌకర్యాల కల్పన లేదు. వారికి ఆరోగ్య సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. అలాగే అర్థాంతరంగా కంపెనీలను, సంస్థలను మూసేసి కార్మికులు నోట్లో మట్టి కొడుతున్నారు. నేటికీ ఇంకా ఫ్యూడల్ భావాల నుంచి యాజమాన్యాలు బయటపడడం లేదు. 1886 మే 3వ తేదీన చికాగోలోని హే స్క్వేర్ వద్ద పోలీసు కాల్పుల్లో ఒక వైపు రక్తం చిందుతుంటే మరోవైపు ఆ రక్తంలో తడిచిన ఎర్రబట్టను తమ జెండాగా పైకెత్తి చూపారు. కార్మికవర్గ త్యాగం అంటే అని చాటిచెబుతూ, కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగంతోనే కనీస పనిగంటలు, కనీస వేతనాలు సాధించుకున్నారు. అయితే నేటికీ వాటిని అమలు చేయాల్సిన యాజమాన్యాలు ఇంకా తమ బానిస భావన నుంచి బయటపడడం లేదు. కార్మిక వర్గం లేకుంటే తమకు పురోగతి లేదన్న భావనలో లేరు. పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో శ్రామికులు బానిసల వలే పని చేసేవారు. కార్మికులు రోజుకు 16 నుంచి 20 గంటల వరకు పని చేసేవారు. అయితే చైతన్యం పెరగడంతో మెల్లగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి కార్మికులు తిరుగుబాట్లు ప్రారంభించారు. ఆనాడు కార్మికులకు ఎటువంటి భద్రత గాని, సౌకర్యాలు గాని వుండేవి కాదు. ఫ్యాక్టరీల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుండి రక్షణ లేదు. తరచుగా ప్రమాదాలకు గురై మరణించే వారు. కార్మికులు అమానుష శిక్షలకు గురౌతుండేవారు. కార్మికులు తమ పీడనకు వ్యతిరేకంగా యంత్రాలను ధ్వంసం చేసేవారు. ఈ విధ్వంసకాండ బ్రిటన్‌లో ప్రారంభమైంది. యంత్రాలను విచ్ఛిన్నం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ బ్రిటన్‌లో చట్టం చేసారు. ఈ దుస్థితి నుంచి బయట పడడానికి పోరాటం సల్పడం ఒక్కటే మార్గమని కార్మికవర్గం అర్థం చేసుకుంది. కార్మిక వర్గం చైతన్యవంతంగా వున్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభ మైంది. 1806లో అమెరికాలోని ఫిలదెల్ఫియా కార్మికులు సమ్మె చేశారు. ఫిలదెల్ఫియా నగరంలో 'మెకానిక్స్ యూనియన్' పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు సంఘాలను నిర్మించుకొని పోరాటాలు సాగించారు. ట్రేడ్ యూనియన్ల మహత్తర శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్ట విరుద్ధమని పాలకులు యూనియన్లను నిషేధించారు. అయినా ట్రేడ్ యూనియన్ల నిర్మాణం వేగంగా సాగింది. 1848లో కారల్‌మార్క్స్ 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అని పిలుపునిచ్చారు. 1871లో ఏర్పడిన మొదటి కార్మికవర్గ రాజ్యం ఫ్రాన్స్‌లో కార్మికవర్గ పోరాటాల ఫలితమే ప్యారిస్ కమ్యూన్. 1886 చికాగో కార్మికుల పోరాటం,884 అక్టోబర్‌లో అమెరికా, కెనడాల ఆర్గనైజ్డ్ ట్రేడ్ అండ్ లేబర్ యూనియన్ల నాలుగవ మహాసభ జరిగింది. 1886 మే నుండి 8 గంటల పని చట్టబద్ధమైన పని దినంగా వుంటుందని తీర్మానం చేసింది. మే 1వ తేదీన సమ్మె చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. 'మనిషి జీవితంలో రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య' అనే శాస్త్రీయ పద్ధతి కోసం పోరాడాలని నిర్ణయించారు. ఈ పిలుపుకు అశేషమైన స్పందన వచ్చింది. వేలాది మంది కార్మికులు అనేక సంస్థలు '8 గంటల పని దినం' కోసం మే1వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. 1889లో ప్యారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడేను అంతర్జాతీయ కార్మికదినంగా అమలు చేయాలని తీర్మానాన్ని రూపొందించింది. అప్పటినుంచి మేడేను అధికారికంగా కార్మికలోకం జరుపు కుంటోంది. ఆతరవాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్మికవర్గ కార్యక్రమాలు బాగా పెరిగాయి. మారిన ప్రపంచ పటంలో మారుతున్న కాలంలో ఇంకా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నాయి. కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్నాయి. యాజ మాన్యాలకు వత్తాసు పలికే బూర్జువా విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి. అప్పుడే మేడేకు సార్థకత చేకూరుతుంది. పారిశ్రామికీకరణ తరవాత కూడా మార్పులు రావడం లేదు. కార్మాకులకు మక్కులు లేకుండా చేస్తున్న యాజామాన్యాలకు అనుగుణంగా చట్టాలు తీసుకుని రావడం దారుణం. ఈ పరిస్థితులనుంచి బయటపడాలి. పక్కాగా శ్రామిక చట్టాలు అమలు చేసి వారికి అండగా నిలవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మంత్రి కోసం మొక్కల తొలగింపు



**యాదాద్రి, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మొన్న మంత్రి మల్లారెడ్డి.. ఇవాళ మరో మంత్రి శ్రీనివాస్ గౌడ్ మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. తన కాంప్లెక్స్ కనిపించడం లేదని మంత్రి మల్లారెడ్డి ఏకంగా 70 చెట్లను నరికించారనే ఆరోపణలు ముగియక ముందే..తాజాగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ సభకు మొక్కలు అడ్డంగా ఉన్నాయని అధికారులు వాటిని తొలగించారు. యాదాద్రి జిల్లా ఆలేరులో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సభ కోసం హరితహారం మొక్కలను అధికారులు తొలగించారు. సుమారు 30 మొక్కలను తొలగించినట్లు సమాచారం. మంత్రి శ్రీనివాస్ గౌడ్ నూతన గౌడ సంఘం భవనంతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో మొక్కలను తొలగించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

## ఈసారి అతిభారీ ఎండలు

(మొదటి పేజీ తరువాయి..) పశ్చిమ రాజస్థాన్‌లోని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 50 డిగ్రీ సెల్సియస్ దాటేందుకు అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏప్రిల్‌లో నమోదయిన అత్యధిక ఉష్ణోగ్రతల్లో ఈ ఏడాది ఏప్రిల్ 4వ స్థానంలో నిలిచిందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం మహాపాత్ర చెప్పారు. పశ్చిమ- మధ్య భారతం, వాయువ్య ప్రాంతాల్లో సాధారణ స్థాయి కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదుతాయని మహాపాత్ర హెచ్చరించారు. ఈశాన్య భారతంలోనూ ఇవే పరిస్థితులు కనిపిస్తాయని చెప్పారు. కాగా గత 122 ఏళ్లలో వాయువ్య, మధ్య భారతంలో ఏప్రిల్ నెల సగటు ఉష్ణోగ్రతలు 35.90 డిగ్రీ సెల్సియస్, 37.78 డిగ్రీ సెల్సియస్ చొప్పున ఉన్నాయని గుర్తుచేశారు. కాగా దేశంలో అత్యధిక ఉష్ణోగ్రత 1956లో రాజస్థాన్‌లో 52.6 డిగ్రీ సెల్సియస్ నమోదయిన విషయం తెలిసిందే.

## ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించరా !

(మొదటి పేజీ తరువాయి..) పరిష్కరించాలని కోరారు. 12 వారాలుగా పనిచేయించుకుని డబ్బులు ఇవ్వడంలేదని తెలిపారు. ఈ సందర్భంగా షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం వ్యాప్తంగా అక్రమ మద్యం ఏరులై పారుతోంది. ఉద్యోగాలు లేక చదువుకున్న బిడ్డలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చిన్నదొర కేటీఆర్?కు ఏపీలో ఫ్రెండ్స్ ఉన్నారట.. తెలంగాణలో ఎవరూ లేరట. ఆత్మబలిదానాలు చేసుకున్న కుటుంబాలు కేటీఆర్?కి ఫ్రెండ్స్ కాదట. తెలంగాణలో ఫ్రెండ్స్ ఉంటే ఇక్కడ ఆత్మహత్యలు మీకు కనిపించేవి. వడ్లు కొనక రైతులు పడుతున్న బాధలు కనిపించేవి. రాష్ట్రంలో అసలు ఉద్యమకారులను పట్టించుకొనే పరిస్థితులు లేవని పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి..) ప్రతీ వడ్ల గింజ కొంటామని ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం మీరు ఆర్భాటంగా ప్రకటించి 15 రోజులు కావస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను గమనిస్తే మీ ప్రకటన కేవలం ఉత్తర కుమారుని ప్రగల్భాలేనని స్పష్టం అవుతోంది. ఇప్పటికైనా మీరు కళ్లకు కట్టుకున్న గంతలు తీసేసి క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేయాలని బీజేపీ తెలంగాణ శాఖ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తున్న నాకు అనేక మంది రైతులు వచ్చి కొనుగోళ్ళ కేంద్రాలు ప్రారంభించలేదని, దీనివల్ల వారు పడుతున్న ఇబ్బందులను నా దృష్టికి తీసుకొని వచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గద్వాల్ లో 71 కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించాల్సి వుండగా కేవలం రెండు కేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. అదేవిధంగా వనపర్తిలో 225 కేంద్రాలకు 19 కేంద్రాలు, నారాయణపేట్‌లో 91 కేంద్రాలకు 70 కేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కాంటా పెడుతున్నది మాత్రం నామామాత్రం. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల కేంద్రాలు ప్రారంభించాల్సి వుండగా కేవలం 2,500 కేంద్రాలు మాత్రమే ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం 60 లక్షల టన్నులు ధాన్యం కొనాల్సి వుండగా కేవలం 2 లక్షల టన్నులు మాత్రమే ఇప్పటివరకు కొన్నది. దీన్ని బట్టే రాష్ట్రప్రభుత్వానికి రైతుల సంక్షేమం పట్ల ఎంత శ్రద్ధ, చిత్తశుద్ధి ఉన్నదో స్పష్టం అవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించటమే కాకుండా ప్రతీ ఒక్క కొనుగోలు కేంద్రాల్లో కాంటా ఏర్పాటుచేసి ప్రతీ ఒక్క గింజ కొనుగోలు చేయాలని బిజెపి రాష్ట్రశాఖ తరుపున డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కాంటాలు ఏర్పాటు చేయకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. రైతులు వడ్లను తీసుకొని కొనుగోలు కేంద్రాలకు వస్తున్న వాటిని కొనుగోలు చేయకపోవడంవల్ల వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను, కాంటాలను ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని రైతులకు అవసరమైనంత గోనుసంచులను సేకరించాలని, రైతుల నుంచి సేకరించిన వడ్లకు వెంటనే చెల్లింపులు చేయాలని, అకాల వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనాలని బిజెపి తెలంగాణ శాఖ తరుపున డిమాండ్ చేస్తున్నాం. ధాన్యం కొనుగోలుకయ్యే ప్రతి పైసా ఖర్చును కేంద్రప్రభుత్వమే చెల్లిస్తున్నందున రాష్ట్రప్రభుత్వం ఎటువంటి అలసత్వాన్ని చూపించకుండా ధాన్యం కొనుగోలుకు యుద్ధప్రాతిదికన చర్యలు చేపట్టాలి. రాష్ట్రప్రభుత్వం సేకరించిన వడ్లను బియ్యంగా మార్చి కేంద్రప్రభుత్వానికి ఇస్తే పూర్తిగా తీసుకోవడానికి కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్రప్రభుత్వం వెంటనే ఆలస్యం చేయకుండా కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొస్తున్న ప్రతీ ఒక్క వడ్ల గింజను కొనుగోలు చేయాలని రైతులపక్షాన విజ్ఞప్తి చేస్తున్నట్లు బండి తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతీ గింజ కొనేవరకు, వారికి చెల్లించాల్సిన సొమ్ములను చెల్లించే వరకు రైతులు పక్షాన బీజేపీ శాఖ తెలంగాణ శాఖ పోరాడుతుందన్నారు.

### చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

(మొదటి పేజీ తరువాయి..) తెలంగాణ నుంచి అనేకమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో తమ ప్రతిభను చాటి ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని చెప్పారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో ప్రతిభ చాటే విధంగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మొత్తం ఆరు జోన్లలో 854 సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్యాంప్‌లలో అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, కరాటే, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్ వంటి తదితర 44 రకాల క్రీడలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, నెల రోజులపాటు క్యాంప్ కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఇంగ్లీష్‌లోనే కోర్టు వ్యవహారాలు సరికాదు




(మొదటి పేజీ తరువాయి..) మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లతో ఇవాళ ఢిల్లీలో సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ విధుల నిర్వహణలో లక్ష్మణ రేఖను గుర్తుంచుకుని పనిచేయాలని ఆయన సూచించారు. ఒకవేళ అన్నీ చట్టానికి లోబడే జరిగితే, అప్పుడు పరిపాలనా వ్యవస్థకు న్యాయవ్యవస్థ అడ్డురాదు అని ఎన్వీ రమణ అన్నారు. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయితీలు సక్రమంగా డ్యూటీ నిర్వహిస్తే, పోలీసులు సరైన రీతిలో విచారణలు చేపడితే, అక్రమ కస్టడీ మరణాలను నిరోధిస్తే, అప్పుడు ప్రజలు కోర్టులకు వెళ్లాల్సిన అవసరం ఉండదని సీజే రమణ తెలిపారు. కోర్టులు ఇస్తున్న తీర్పును అనేక ఏండ్ల నుంచి ప్రభుత్వాలు అమలు చేయడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి హాని కలిగించే అంశాలపై కోర్టులు ఎన్ని తీర్పులు ఇచ్చినా.. కావాలనే ఆ తీర్పు అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. విధాన నిర్ణయాలు తమ పరిధిలోకి రావని, కానీ ఎవరైనా వ్యక్తి తమ వద్దకు ఫిర్యాదుతో వస్తే, ఆ వ్యక్తిని కోర్టు తిరస్కరించదని ఎన్వీ రమణ తెలిపారు. ప్రజల ఆశయాలను, ఆందోళనలను అర్థం చేసుకుని, వాటినిపై సుదీర్ఘంగా చర్చించిన తర్వాత చట్టాలను చేయాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం సహించేది లేదన్నారు. ప్రజా ప్రయోజన వాజ్యాలను.. వ్యక్తిగత వాజ్యాలుగా వాడుతున్నట్లు ఆరోపించారు. రాజకీయ, కార్పొరేట్ ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు పిల్స్ వేస్తున్నారని రమణ విమర్శించారు.

## బండి సంజయ్‌ది పాదయాత్ర కాదు

(మొదటి పేజీ తరువాయి..) విరుచుకుపడ్డారు. టీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. అడ్డుకోవడమే మీ పని అయితే కిషన్ రెడ్డి తెలంగాణలో తిరగలేడు. బండి సంజయ్ పాదయాత్ర చేయలేడని హెచ్చరించారు. బీజేపీ నేతలది ఓర్వలేని తనమని మండిపడ్డారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని తెలిపారు. అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. మోదీ అసమర్థత వల్ల దేశంలో కరెంట్ కోతలు ఏర్పడ్డాయన్నారు. గ్గారెడ్డి తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో జగ్గారెడ్డి ఎక్కడున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహులకు జగ్గారెడ్డి కొమ్ము కాశారని ధ్వజమెత్తారు. ఉద్యమపార్టీకి ద్రోహం చేసిన చరిత్ర జగ్గారెడ్డిది అని సుమన్ నిప్పులు చెరిగారు. జగ్గారెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. యూకు వచ్చే ముందు తెలంగాణ ప్రజలకు రాహుల్ క్షమాపణలు చెప్పాలని సుమన్ డిమాండ్ చేశారు. రాజకీయ పబ్బం గడుపుకునేందుకు రాహుల్ పర్యటన అని పేర్కొన్నారు. తెలంగాణకు రాహుల్ గాంధీ వచ్చి చేసేదేమీ లేదని చెప్పారు. సొంత రాష్ట్రంలో రాహుల్ తన పార్టీని గెలిపించుకోలేదని సుమన్ ధ్వజమెత్తారు.

## మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

(మొదటి పేజీ తరువాయి..) మరణాలు ఢిల్లీలోనే నమోదు అయ్యాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్‌కేసుల సంఖ్య 18, 684గా ఉంది. దేశం మొత్తం మీద ఇప్పటిదాకా కరోనాతో మరణించిన వాళ్ల సంఖ్య 5,23,803గా నమోదు అయ్యింది. దేశంలో కరోనా టీకా పంపిణీ వేగంగా సాగుతోంది. శుక్రవారం 22,58,059 మందికి టీకాలు అందించారు. దీంతో ఇప్పటివరకు పంపిణీ చేసిన డోసుల సంఖ్య 1,88,89,90,935కు చేరింది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు భారీగా తగ్గాయి. ఒక్కరోజు వ్యవధిలో 5,83,044 కొత్త కేసులు నమోదయ్యాయి. మహమ్మారి ధాటికి 2,323 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ కొరియా, జర్మనీ, ఆస్ట్రేలియా, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో కొవిడ్ ఉధృతి తీవ్రంగా ఉంది.

## కెటిఆర్ వ్యాఖ్యలతో విమర్శల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి..)ఆయన తన వ్యాఖ్యలపై తిరిగి స్పందించారు. తాను క్రెడాయ్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు అనుకోకుండా చేసినవని.. అవి ఆంధ్రప్రదేశ్‌లోని తన స్నేహితులకు తెలియకుండానే కొంత బాధ కలిగించి ఉండొచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో ట్వీట్ చేశారు. 'ఈరోజు ఒక మీటింగ్‌లో అనుకోకుండా చేసిన వ్యాఖ్యలు.. ఏపీలోని నా స్నేహితులకు తెలియకుండానే కొంత బాధ కలిగించి ఉండవచ్చు. నేను ఏపీ సీఎం జగన్ గారిని సోదర సమానుడిగా భావిస్తున్నా. ఆయన నాయకత్వంలో ఆ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని మనసారా కోరుకుంటున్నా' అని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగింది. దీంతో సోషల్ మీడియా వేదికగా.. కేటీఆర్ వ్యాఖ్యలపై వైసీపీ వార్ ప్రకటించింది. పెద్ద ఎత్తున విమర్శనాస్త్రాలు స్పందించింది. అసలే ఎన్నికల తరుణం సమీపిస్తోంది. భాయీ.. భాయీ అనుకోవాల్సిన సమయంలో ఈ వైరమెందుకని భావించారో ఏమో కానీ కేటీఆర్ రాత్రికి రాత్రే మనసు మార్చుకున్నారు. తనేదో ఆ వ్యాఖ్యలను అన్యాపదేశంగా చేశానని.. వాటి వెనుక దురుద్దేశమేమీ లేదని సంజాయిషీ ఇచ్చుకున్నారు. కొన్ని గంటల్లోనే జగన్‌కు జై కొట్టారు. కానీ చేతులు కాలాక.. ఆకులు పట్టుకుంటే ఏం ప్రయోజనం. చేసిన వ్యాఖ్యలేమో క్రెడాయ్ సమావేశంలో.. ఇలాంటి చోట అలాంటి వ్యాఖ్యలు చేస్తే ఏపీకి వచ్చే పెట్టుబడులు సైతం వెనుతిరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.ఏపీలో పరిస్థితులపై తెలంగాణ మంత్రి కేటీఆర్ చేసిన కామెంట్లు కాకరేపాయి. అయితే, ఎవరినో కించపరచాలనో, బాధపెట్టాలనో తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని, అన్యాపదేశంగానే అవి తన నోటి వెంట వచ్చాయని అన్నారు. ఏపీ సీఎం జగన్‌ను తన సోదరుడిగా భావిస్తానని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందాలని మనసారా కోరుకుం టున్నట్టు కేటీఆర్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై జగన్ మంత్రివర్గంలోని మంత్రులు కూడా తీవ్రంగా స్పందించిన సంగతి తెలిసిందే. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. దేశంలో అనేక మంది ముఖ్యమంత్రులు ఏపీకి వచ్చి అభినందిస్తున్నారు.. కానీ, కేటీఆర్ ఎవరి మెహర్బానీ కోసమే ఈ వ్యాఖ్యలు చేశారని కౌంటర్ ఇచ్చారు.. కేటీఆర్ ఆ రకంగా మాట్లాడ కూడదన్న ఆయన.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామన్నారు?ఇచ్చారా? నాలుగు చినుకులు పడగానే హైదరాబాద్ అంతా మునిగిపోతుంది..డ్రగ్స్ కేసులు ఏ రకంగా హైదరాబాద్‌లో ఉన్నాయో అందరికీ తెలుసు.. ఇలాంటివి చెబితే చాలా ఉంటాయన్నారు కారుమూరి నాగేశ్వరరావు. మరో మంత్రి రోజా కూడా స్పందించిన సంగతి తెలిసిందే. ఏపీ గురించి కేటీఆర్ మాట్లాడలేదు అనుకుంటున్నా.. పొరుగు రాష్ట్రం అన్నారు.. ఆంధ్రప్రదేశ్ కాదు అనుకుంటానన్నారు.

## తలసేమియాకు ఆరోగ్యశ్రీలో చికిత్సలు

(మొదటి పేజీ తరువాయి..) బాధిత పిల్లలను చూస్తుంటే కలుగుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన విధంగా బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య శ్రీ కింద అలాంటి పిల్లలందరికీ ఉచిత వైద్యం అందిస్తున్నామని తెలిపారు. తలసేమియా, సికెల్ సెల్ సోసైటీ ఆధ్వర్యంలో కమలా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.తెలంగాణలో కమలా సోసైటీ తలసేమియా రోగులకు మంచి సేవ అందిస్తోందని హరీశ్‌రావు ప్రశంసించారు. ఆదిలాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ఈ వ్యాధి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. కమలా సొసైటీకి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. రెడ్ క్రాస్ సోసేటీ, కమలాసోసైటీ వంటి సంస్థలతో మరో మారు ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి ఇంకా తలసేమియా అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చిద్దామని హరీశ్‌రావు పేర్కొన్నారు. తలసేమియా వ్యాధి నివారణపై దృష్టి సారించాలన్నారు. తెలంగాణ తలసేమియా రహిత రాష్ట్రంగా, దేశంలో తలసేమియా కేసులు లేని తొలి రాష్ట్రంగా నిలిపేందుకు కృషి చేస్తాం. ఈ వ్యాధి నివారణకు మా వంతు కృషి చేస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## బిజెపిని అందరూ కలసికట్టుగా ఎదుర్కోవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి..) దేశంలో థర్డ్ ఫ్రంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని తాను అనుకోవడం లేదని, బీజేపీని తొలి ఫ్రంట్ అనుకుంటే కనుక అప్పుడు దానిని ఓడించేందుకు రెండో ఫ్రంట్ మాత్రమే ఉండాలని అన్నారు. బీజేపీని ఓడించాలని అనుకునే ఏ పార్టీ అయినా అది రెండో ఫ్రంట్‌గా మాత్రమే ఉండాలని పేర్కొన్నారు. అలాంటప్పుడు మరి కాంగ్రెస్‌ను రెండో ఫ్రంట్‌గా భావిస్తారా? అన్న ప్రశ్నకు 'కాదని' సమాధానం చెప్పారు. కాంగ్రెస్ దేశంలోని రెండో అతిపెద్ద పార్టీ మాత్రమేనని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో బీజేపీని ఎదుర్కొని కాంగ్రెస్ నిలబడగలదా? అన్న ప్రశ్నకు ప్రశాంత్ కిషోర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ బలంగా వేళ్లూనుకు పోయిన పార్టీ అని, ఆ పార్టీకి అవకాశాలు లేవని చెప్పడం తప్పే అవుతుందన్నారు. అయితే, ఆ పార్టీలో కొన్ని మార్పులు అవసరమన్నారు. 2024లో మోదీని మార్చేదెవరో తనకు తెలియదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలను బట్టి లోక్‌సభ ఎన్నికలను అంచనా వేయలేమని ప్రశాంత్ కిషోర్ తేల్చి చెప్పారు.

# అమ్ ఆద్మీ పార్టీ ఆద్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ

### కార్యక్రమంలో పాల్గొన్న ఆప్ నేత ఇందిరాశోభన్




**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు హైదరాబాద్ నగర కాలనీలలో ఆప్ పార్టీ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆప్ పార్టీ నేత ఇందిరాశోభన్ పాల్గొని పలు కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరా శోభన్ మాట్లాడుతూ.. తెలంగాణ మైనారిటీ ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని అన్నారు. మైనారిటీ సోదరులు అతి పవిత్రంగా భావించే రంజాన్ పండుగ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# స్వేదం చిందిస్తున్న సింగరేణి కార్మికులు

(మొదటి పేజీ తరువాయి..) పరిష్కారం కోసం ముందు నిలబడాలి. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాల్సి ఉంది. సింగరేణిలో కొత్త బావులు విస్తరిస్తామని, ఉపాధి పెంచుతామని, కార్మిక హక్కుల కాపాడుతామని ఇచ్చిన హామీలు అమలు కావాల్సి ఉంది.అలాగే వారసత్వ ఉద్యోగాలు ఇంకా అందని ద్రాక్షగా మిగిలింది. సింగరేణిలో పనిచేసి బయటకు వచ్చిన కార్మికులు మళ్లీ ఏ పనీ చేయలేని స్థాయిలో నిసత్తువ కలిగి ఉంటారు. వారిని ఉత్పాదక శక్తిగా గుర్తించి ఆదుకోవడంలో ప్రభుత్వాలు ఉదారంగా వ్యవహరించి ఆదుకోవాలి. కొత్త బొగ్గుబావుల విస్తరణతోనే ఉద్యోగాలు సృష్టించ బడతాయి. అప్పుడే సింగరేణి మనుగడ కొనసాగుతుంది. కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం దృష్టిసారించాలి. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే ఉత్పత్తి పెరుగుతుందని గుర్తించాలి. శ్రమదోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి ఆ వ్యవస్థనే రద్దు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ ఇప్పుడు వారి సంక్షేమంపై దృష్టి పెట్టాలి. శ్రమదోపిడీకి గురవుతున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులను ఆదుకుని వారికి ఉద్యోగ భరోసా కల్పించాలి.కేంద్ర ప్రభుత్వంతో సమానంగా ఉద్యోగులకు వేతనాలు ఇస్తామని ముఖ్యమంత్రి ఎలాగూ హామీ ఇచ్చారు కనుక కోల్ ఇండియాలో జరిగిన ఒప్పందాలను సింగరేణిలో అమలు చేయాల్సి ఉంది. లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికులు కోరుకుంటున్నారు. కోల్ ఇండియా ఒప్పందాలను అమలు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను యాజమాన్యం విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# బోగ ప్రకాష్ కి మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ అవార్డు




**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మూడు సంవత్సరాల నుండి కోవిడ్-19 మహమ్మారిలో ప్రజలకు సేవలందించినందుకు బోగ ప్రకాష్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రకాష్‌ను సేవారత్న అవార్డుతో సత్కరించారు. ఉప్పల్, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పనిచేస్తున్న ఆరోగ్య పర్యవేక్షకునిగా ప్రకాష్ పని చేస్తున్నారు. ఈ వేడుకలు శుక్రవారం సాయంత్రం రవీంద్రభారతి ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. తన సేవలను గుర్తించి సేవారత్న అవార్డును ప్రదానం చేసిన మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీ.దస్తయ్య, సెక్రటరీలకు బోగ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

# గుజరాత్ తీరంలో భారీగా హెరాయిన్ స్వాధీనం



**అహ్మదాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** గుజరాత్ తీరంలోని పిపావావ్ పోర్టులో దాదాపు 90 కిలోగ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.450 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇరాన్ నుంచి అమ్రేలి జిల్లాలోని పిపావావ్ పోర్టుకు చేరుకున్న ఓ షిప్పింగ్ కంటెయినర్ నుంచి ఈ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు డ్రగ్స్ అక్రమ రవాణాదారులు ప్రత్యేక పద్ధతి అవలంబించారని డీజీపీ అశిష్ భాటియా తెలిపారు. హెరాయిన్ ఉన్న ద్రావణంలో దారాలను నానబెట్టి, అవి ఆరిన తర్వాత బేల్స్‌గా చేసి ఎగుమతి చేసేందుకు బ్యాగుల్లో ప్యాకింగ్ చేశారని వివరించారు.

# పారా లీగల్ వాలంటీరీలకు ట్రైనింగ్




**నారాయణఖేడ్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** నారాయణఖేడ్ మండల లీగల్ సర్వీస్ కమిటీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో పారా లీగల్ వాలంటీర్లకు 28 మరియు 29 తేదీలలో ట్రైనింగ్ నిర్వహించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జగదీశ్ ఎస్ ఐ ఆర్ ఎస్ ఐ పోలీస్ కంప్లైంట్ పై గోపాల్ మోటార్ వాహనాల చట్టం వినియోగదారుల రక్షణ చట్టం ప్రామిసరీ నోట్లు పై సందీప్ కుమార్ ప్రాథమిక హక్కులు బాల్యవివాహాల నిర్మూలన చట్టం పై శ్రీనివాస్ కన్యా ఆర్థిక హిందూ వారసత్వ చట్టం తెలంగాణ విక్టిమ్ కంపెన్సేషన్ యాక్ట్ రెవెన్యూ చట్టం పై ముజాహిద్ అలీ మహిళా రక్షణ చట్టాలు పై అనుష జువెనల్ చట్టం పై లీగల్ సర్వీస్ యాక్ట్ ఫ్రీ లీగల్ ఎయిడ్ ఫ్రీ లిటిగేషన్ కేసులు బ్రహ్మానంద రెడ్డి దత్తత పై సాలోమోన్, కాంపౌండబుల్ కేసులు పై ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు లీగల్ సర్వీసెస్ సిబ్బంది పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## దళిత మైనర్ యువతి అత్యాచార బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాడుతాం

మెదక్ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు: సందీప్ రామకాంత్



**టేక్మాల్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** టేక్మాల్ మండలంలోని పాల్వంచ గ్రామంలో జరిగిన మైనర్ దళిత యువతిపై అత్యాచార ఆరోపణలపై మెదక్ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు సందీప్ రమాకాంత్ దుయ్యబట్టారు. సందీప్ రమాకాంత్ మాట్లాడుతూ.. బాధితులకు అండగా ఉంటామని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు యువమోర్చా పక్షాన పోరాడుతాం అని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితుడికి శిక్ష పడేదాకా ఈ పోరాటం ఆగదు అని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే క్రాంతి కుమార్ పైన ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే అండ చూసుకొని దళితులపై అనేక అఘాయిత్యాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ఎమ్మెల్యే తమ్ముడి సహకారం కూడా నిందితునికి ఉందని, కావున వెంటనే నిందితుడికి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని భారతీయ జనతా యువమోర్చా తరఫున హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ బజరంగ్దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ యువ మోర్చా మెదక్ పట్టణ ఉపాధ్యక్షుడు రాహుల్ టేక్మాల్ మండల యువమోర్చా ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొనడం జరిగింది.

## మెదక్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ సమిక్షా సమావేశం

బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు మాసన్నగారి నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు




**మెదక్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ సమావేశం విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, మాసన్నగారి నాగరాజు అన్నారు. ఈ సమేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ పాల్గొని సమీక్షా సమావేశం చేపట్టారు. పార్టీ బలమైన నిర్మాణం కొరకు సూచనలు సలహాలు సూచించారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు నియోజకవర్గ ఇంఛార్జీలు, అధ్యక్షులు, సెక్టార్ కమిటీల అధ్యక్షులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా కోశాధికారి స్వామిదాసు, జిల్లా కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొయ్య నర్సింహులు, శాంతికుమార్, మహిళా కన్వీనర్ లక్ష్మి, నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్, టేక్మాల్ మండల నాయకులు మ్యాతరి యాదగిరి, నాగభూషణం, తూప్రాన్ మండల నాయకులు శ్రీనివాస్, దాదాయి కోటంగారి పల్లి అనీల్, కందిపల్లి రాజు, శంకర్, భాను చెందర్, సిద్ధిరాములు మొదలైన బీఎస్పీ యువ నాయకులు పాల్గొన్నారు.

## బాధితునికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



**టేక్మాల్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** టేక్మాల్ మండల్ వేల్పుగొండ గ్రామానికి చెందిన నీరుడి దేవయ్యకు కొన్ని రోజుల క్రితం ఆరోగ్యానికి గురైయ్యారు. దేవయ్యకు సీఎం సహాయనిధి ద్వారా 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందింది. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సహకారంతో చెక్కును దేవయ్యకు అందజేసే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు సాయిలు ఎం పి టి సి నారాయణ రెడ్డి మాజీ ఎంపిటిసి ఆనందం భాగ్యరాజ్ మాజీ అధ్యక్షుడు సంగయ్య నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు




**సంగారెడ్డి, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గానికి చెందిన ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ స్థలాన్ని మంజూరు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకుడు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావును కలిశారు. శనివారం మంత్రి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పి నారాయణ మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పులిమామిడి రాజు ఉపాధ్యక్షుడు విజయ్ భాస్కర్ ప్రధాన కార్యదర్శి నాగేష్ ముదిరాజ్ సంఘం నాయకులు శివ, గణేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మే 1 నుండి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిబిరాలు



**సంగారెడ్డి, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** సంగారెడ్డి జిల్లాలో మే 1 నుండి 31 వ తేదీ వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రామచంద్రరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవి క్రీడా శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో పది పట్టణ ప్రాంతాల్లో 9 క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల 14 సంవత్సరాలలోపు బాల బాలికలు తమ దగ్గరలో గల క్యాంపు ఛార్జీలను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడా శిబిరాలకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నారు. శిక్షణ సదుపాయాలు పూర్తిగా ఉచితం అని తెలిపారు శిక్షణకు అవసరమైన సామాగ్రి నిర్వహణ శిక్షకుడి పద్యాలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చెల్లిస్తుందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ నగదు రూపాయలు 800 ఇతర క్రీడలకు 500 చొప్పున తెలిపారు. వేసవి క్రీడా శిబిరాలు ఉదయం 6 గంటల నుండి 9 వరకు సాయంత్రం నాలుగు నుండి 7:00 వరకు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో నేరుగా గాని లేదా 08455 276010 / 274344 ఓల్డ్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** శనివారం అశ్వాపురం మండలం అమెర్ధ గ్రామానికి చెందిన కోర్స వీరమ్మ (58) సంవత్సరాలు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధిత నివాసానికి చేరుకొని మృతురాలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న తెరాస రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్ రెడ్డి



**దోమ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మల్లెపల్లి గ్రామ సర్పంచ్ మనవడు తెలంగాణ ఉద్యమకారుడు మల్లెపల్లి నర్సింహులు కుమారుడు అయిన నిశాంత్ పుట్టిన రోజు సందర్భంగా తెరాస రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరై నిశాంత్‌ను ఆశీర్వదించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యబాజిగూడెం సర్పంచ్ ప్రవీణ్, తెరాస నాయకుడు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాగరాజు మృతి మణుగూరు ఏరియా కాంట్రాక్టు కార్మిక ఉద్యమానికి తీరని లోటు


ఐ.ఎఫ్.టి.యు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మధుసూదన్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** నాగరాజు మృతి మణుగూరు ఏరియా కాంట్రాక్టు కార్మిక ఉద్యమానికి తీరని లోటని ఐ.ఎఫ్.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం రాజుపేట గ్రామంలో వారి స్వగృహంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి, వారి భౌతిక కాయంపై అరుణ పతాకం కప్పి, వారి మృతికి సంతాపం ప్రకటించి, జోహార్లు అర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 సంవత్సరంలో మణుగూరు లో గ్లోబల్ కోల్ వాషర్ ప్లాంటు ప్రారంభమైనప్పుడు ఐ.ఎఫ్.టి.యు యూనియన్ తరపున గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్లో సెక్యూరిటీ గార్డుగా విధుల్లో చేరాడని అన్నారు. అనారోగ్యం తో29.4.2022 తారీఖున ఖమ్మం హాస్పిటల్ లో మరణించడం జరిగింది అన్నారు. ఇతని వయస్సు 30 సంవత్సరాలు అతి చిన్న వయసులో మరణించడం బాధాకరం అన్నారు. అతను విధుల్లో చేరినప్పటి నుండి కంపెనీలో తన విధులు నిర్వహిస్తూనే, కార్మికుల సమస్యలపై, ప్రజా సమస్యలపై యూనియన్ నిర్వహించే అన్ని ఆందోళనా కార్యక్రమాల్లో పాల్గొనేవాడు అన్నారు. అతని మరణం మణుగూరు ఏరియా కార్మిక ఉద్యమానికి లోటు అన్నారు. అతనికి భార్య లక్ష్మి 25 సంవత్సరాలు, ఒక పాప, ఒక బాబు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు అన్నారు. అతని మరణంతో వారి కుటుంబం రోడ్డున పడింది అన్నారు. వారి యొక్క కుటుంబ ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకొని గ్లోబల్ యాజమాన్యం వారి కుటుంబానికి ఆర్థికంగా సహకరించి, కంపెనీలో అతని భార్యకు ఉపాధి కల్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్లోబల్ యాజమాన్యాన్ని కోరారు. కార్మికులు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు బ్రాంచి కార్యదర్శి ఎండీ. గౌస్, ఉపాధ్యక్షులు సంజీవ రెడ్డి, నాయకులు చారి, సమ్మన్న, జంపన్న, ప్రవీణ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


## ఉచిత కోచింగ్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోండి

వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**పరిగి, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. పరిగి పట్టణంలోని శారదా గార్డెన్స్ – 2 లో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి గారు నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్ లో 1200 మంది విద్యార్థులకు ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్ ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ విద్యార్థులకు ఉచిత బస్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కల్గివున్న ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ సదుపాయం




**పూడూర్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మండల పరిధిలోని కంకల్ గ్రామానికి చెందిన చింతకింది శంకరయ్య ఇటీవలే ప్రమాదవశాత్తు చనిపోవడంతో అతనికి టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద భీమా వర్తించింది. శనివారం ఇందుకు సంబంధించి రూ. 2,00,000/– లక్షల చెక్కును మృతుడి భార్య జ్యోతికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి చెక్కును పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉండేందుకే ఈ భీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పార్టీ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు చనిపోయిన ప్రతి కుటుంబానికి పార్టీ పక్షాన ఇన్సూరెన్స్ చేసి రూ. 2 లక్షల ప్రమాద భీమా ఇస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూడుర్ మండల ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, పార్టీ నాయకులు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన జానంపేట సర్పంచ్ బాడిస మహేష్



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** పినపాక మండలం జానంపేట గ్రామానికి చెందిన మాధవరావు కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి 60 వేల రూపాయలు మంజూరు అయిన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాడిస మహేష్, ఎంపీటీసీ పోలిశెట్టి, హరీష్, జానంపేట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ రాయల సత్యనారాయణ, ఆత్మ కమిటీ చైర్మన్ పటేల్ భద్రయ్య, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ధూందాం ఇఫ్తార్ విందు



**సంగారెడ్డి, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ధూందాం ఇఫ్తార్ విందును అందించారు. శనివారం సంగారెడ్డి పట్టణంలో రంజాన్ మాసంలో ముస్లింలు ఉపావాస దీక్షలో భాగంగా సాయంత్రం పసందైన వంటకాలు వండించి ముస్లిం సోదరులు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇఫ్తార్ విందు లో పసందైన వంటకాలు లేవని ఆరోపించారు. పేరుకు మాత్రమే ఇస్తారు విందు అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అందించిన ఇఫ్తార్ విందు అమోఘంగా ఉందని కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షులు ఫయాజ్ సిద్దిపేట యువజన నాయకులు గయ్సుఉద్దీన్. హాసనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తన విక్రేతలపై కఠిన చర్యలు

- అవసరమైతే ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ
- దోషులు తప్పించుకోకుండా సత్వరచర్యలకు నిర్ణయం
- రైతులు పత్తి వేసేందుకు ముందుకు రావాలి
- వ్యవసాయ ప్రణాళికలో భాగంగా అధికారులతో సమీక్ష




**హైదరాబాద్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** నకిలీ విత్తనాలను విక్రయించడం ద్వారా రైతులను మోసం చేసే తయారీ దారులపై ఉక్కుపాదం మోపుతామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మినా, కాలంతీరిన విత్తనాలను అమ్మినా కఠినచర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలతో పట్టుబడ్డ వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నకిలీ విత్తనాల కేసులను విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుపై అవకాశా లను పరిశీలిస్తున్నామని అన్నారు. చట్టంలోని లొసుగులతో దోషులు తప్పించుకోకుండా వెంటనే శిక్షలు అమలయితే నకిలీ విత్తన తయారీదారులలో మార్పు వస్తుందన్నారు. ప్రధానంగా పత్తి, మిరప విత్తనాలలో నకిలీ విత్తన సమస్య ఉన్నదని ఆయన అన్నారు. తక్కువ ధరకు విత్తనాలు లభిస్తుండడం మూలంగానే రైతులు నకిలీ విత్తనాల వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన అన్నారు. వానాకాలం వ్యవసాయ ప్రణాళిక లో భాగంగా నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టేందుకు అన్ని జిల్లాల ఎస్పీలు, డీఎఓ, ఎఓలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రధానంగా సాగులో ఉండే కలుపు సమస్యను ఎదుర్కోవడానికి గడ్డి మందు కొట్టేందుకు అవకాశం ఉండడంతో కలుపుకూళ్లు తగ్గుతున్నాయని రైతులు నకిలీ విత్తనాల వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. గడ్డి మందు గ్లైఫో సెట్ అమ్మకాలపై వ్యవసాయ అధికారులు నిఘా పెట్టాలని చెప్పారు. రైతులు తక్కువ ధరకు వస్తున్నాయన్న ఉద్దేశంతో నకిలీ విత్తనాలను కొనవద్దని మంత్రి రైతులను కోరారు. ఈ ఏడాది పత్తి సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని, అంతర్జాతీయంగా తెలంగాణ పత్తికి డిమాండ్ ఉన్నదని మంత్రి తెలిపారు గత ఏడాది వర్షాలు వెనకాముందు కావడం, అధికవర్షాల మూలంగా పెద్దఎత్తున సాగు చేయలేక పోయారు. తనిఖీలలో నిబంధనల మేరకే టాస్క్ ఫోర్స్ టీం వ్యవహరించాలన్నారు. తనిఖీలలో అత్యుత్సాహం ప్రదర్శించడం, తనిఖీల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ మహేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, సీపీలు మహేష్ భగవత్, స్టీఫెన్ రవీంద్ర, ఐజీ నాగిరెడ్డి, ఐజీ డీఎస్ చౌహాన్, అడిషనల్ డీజీ ఇంటలిజెన్స్ అనిల్ కుమార్, ఐజీపీ ఇంటలిజెన్స్ రాజేష్, వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హన్మంతు, రంగారెడ్డి కలెక్టర్ అమేయ్ కుమార్, సీడ్స్ ఎండీ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం



**నాగార్జునసాగర్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** హిల్ కాలనిలో జరిగిన కాంగ్రెస్ సన్నాహాక సభలో విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నందికొండ కౌన్సిలర్లు మరియు టిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారము రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని నల్గొండ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకు పోతుంటే చూసి ఓర్వలేక రేవంత్ రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపారు. నెల్లికల్ లిఫ్ట్ ను మంత్రి జగదీశ్ రెడ్డి ప్రత్యేక చొరవతో యుద్ధ ప్రదీపాదికన పనులు చేపడుతున్న విషయం గుర్తించాలని అన్నారు. అలాగే నిడమనూర్ కోర్ట్ ,కనీసం గ్రామ పంచాయితిగా కూడా గుర్తించని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ చొరవతో నాగార్జున సాగర్ ను మున్సిపాలిటీ గా ఏర్పాటు చేసి నందికొండ గా నామకరణం చేసిన ఘనత మంత్రి జగదీశ్ రెడ్డి దే అన్నారు. నల్గొండ జిల్లా గత కాంగ్రెస్ హయాంలో ప్రజలు ఫ్లోరైడ్ సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతుంటే చూసి పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ గాలికొదిలేసిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా నల్లా కనెక్షన్ ఇచ్చి ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చిన ఘనత మంత్రి జగదీశ్ రెడ్డి దే అని అన్నారు. రేవంత్ రెడ్డిని సొంత పార్టీ నాయకులే అధ్యక్షులుగా గుర్తించడం లేదని అలాంటి వాళ్ళు నోటికి ఏదిపడితే అది మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఆరెస్ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి,కౌన్సిలర్లు ఈర్ల రామకృష్ణ,రమేష్ జి,మంగత నాయక్,ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం సాగర్ అధ్యక్షుడు మోహన్ నాయక్, ఎస్.సి సెల్ రాష్ట్ర నాయకులు ఆదాసు విక్రమ్, చంద్రమౌళి, సైదులు, వెంకటేశ్వర్లు, కొండయ్య, రాములు, చాంద్ పాషా, మల్లికార్జున్, వెంకట్ రెడ్డి, రంజిత్ రెడ్డి, మెండే సైదులు, నారాయణ రెడ్డి, నరేందర్ రెడ్డి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు : జిల్లా ఇంచార్జ్ ఎస్.పి. ఎం.రమణ కుమార్

**మెదక్, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మెదక్ జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు : జిల్లా ఇంచార్జ్ ఎస్.పి. శ్రీ. ఎం.రమణ కుమార్ . జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల (మార్చ్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని మెదక్ జిల్లా ఇంచార్జ్ ఎస్.పి. శ్రీ. ఎం.రమణ కుమార్ గారు తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. గారు హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు.

## ఘనంగా ఇఫ్తార్ విందు: కొప్పుల అనిల్ రెడ్డి




**దోమ, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో సత్యం టీచర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొప్పుల అనిల్ రెడ్డి మాట్లాడుతూ కుల మత భేదం లేకుండా అందరూ కలసిమెలసి సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో తెరాస రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ రెడ్డి, జెడ్ పి టి సి నాగి రెడ్డి, హుమన్ రైట్స్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ షఫీ, మోయిన్, అక్రమ్ మరియు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## పరిగి మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



**పరిగి, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మాజీ ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి పరిగిలో రంజాన్ మాసం సంధర్భంగా పరిగి నియోజకవర్గంలోని ముస్లిం సోదార్లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింసోదరులకు దీక్షను విరమింప చేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో పాటించే ఉపవాస దీక్షలకు విందు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. దైవ అనుగ్రహముతో అందరూ సుఖశాంతులతో ఉండాలని, పరిగి నియోజకవర్గ ప్రజలు ఆయు ఆరోగ్యాలతో ఆనందంగా జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్, మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేస్తున్న టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారా బోయిన రవి ముదిరాజ్



**మునుగోడు, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** చండూరు మండలంలోని పుల్లెంల గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం అయోధ్య తల్లి గడ్డం నర్సమ్మ (70) అనారోగ్యంతో శని వారం మృతి చెందగా ఆమె మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నారబోయిన రవి ముదిరాజ్ అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి రూ.10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు వారితో పాటు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ టిఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధి బోర్డు సతీష్ గౌడ్, చొల్లేడు ఎంపిటిసి వనం నిర్మల యాదయ్య, పాలకూరి రాములు, గంటా రాములు, సూర్య వెంకన్న, పాలకూరి దేవేందర్, భూతరాజు బాలరాజు, కొలుకులపల్లి సత్తయ్య, పాక కిరణ్, వార్డు సభ్యులు బోర్డు శివ గౌడ్, టిఆర్ఎస్వి నాయకులు ముక్కమల్ల రాజు యాదవ్, జంగిలి నాగరాజు, బండారు మల్లేశం మరియు తదితరులు నివాళులర్పించారు.

## కార్యకర్తలకు అండగా నిలుస్తున్న టిఆర్ఎస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జ్ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



**మునుగోడు, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** చండూర్ మండల కస్థలా గ్రామంలో గుడిపెల్లి పెద్దులు పది రోజుల క్రితం మరణించినాడు వారికి ముగ్గరు కుమార్తెలు వారి కుటుంబానికి పరమర్శించి... మన మునుగోడు అభివృద్ధి ప్రదాత కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి 10000 పది వెయ్యిల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం మండలపార్టీ అధ్యక్షుడు పాటల వెంకన్న గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీను, సర్పంచ్ మెండు ద్రౌపతమ్మ వెంకట్ రెడ్డి ఉప సర్పంచ్ ఉరుగుండ్ల వెంకన్న రైతు సమన్వయ సమితి కన్వీనర్ బొమ్మర బోయిన వెంకన్న ఏఎంసీ వైస్ చెర్మెన్ గుండమల్ల శ్రీను మాజీ ఎంపీటీసీ వెంకన్న చిట్టిబాబు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు ఇవ్వాలని ధర్నా



**మునుగోడు, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ప్రతి ఒక్క దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని శని వారం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేయడం జరిగింది. ప్రతి దళిత కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పెరిక వెంకటేశ్వర్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎస్సి సెల్ అధ్యక్షులు, నూనె కోటి ఓబీసీ జిల్లా కన్వీనర్, సాగర్ల లింగస్వామి కాంగ్రెస్ పార్టీ మునుగోడు టౌన్ అధ్యక్షులు, పందుల పర్వతాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు బోయ సురేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు సునీల్ సులేమాన్, దుబ్బ భాస్కర్, పందుల సంపత్, పందుల ఉదయ్, పోలే వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేస్తున్న బీజేవైఎం మండల అధ్యక్షుడు జీడిమెట్ల జానీ



**మునుగోడు, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మునుగోడు మండల కేంద్రంలో ఎమ్మార్వో ఆఫీస్ లో నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని కోరుతు, తాసిల్దార్ జ కర్తి శ్రీనివాస్ మునుగోడు మండల బిజెవైయం అధ్యక్షులు జిడిమట్ల జానీ ఆధ్వర్యంలో వినత్రి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభత్వం ప్రతి నెల 3.016 రూ.లు 40 నెలలు దాటిన ఇప్పటి వరకు మొత్తం 1.20.640 నిరుద్యోగ యువత కు మెత్తాన్ని వెంటనే చెల్లించాలని అన్నారు శనివారం ఎం ఆర్ ఓ గారికి వినితి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి.మాదగోని నరేందర్ గౌడ్.బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పెంబళ్ల జానయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పందుల రాజేష్. సీనియార్బి నాయకులు దుబ్బ జెల్లయ్య.జెవైయం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏర్పుల క్రాంతి కుమార్ మండల ఉఫాధ్యక్షులు యర్ర బెల్లి శంకర్ రెడ్డి.శివ ప్రసాద్ తదితరులు పొల్లొన్నారు.

## బాధితునికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న కిష్టాపురం ప్రజాప్రతినిధులు

పేదలకు తోడ్పాటుగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి : ఎంపీటీసీ భీమనపల్లి సైదులు



**మునుగోడు, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** ఆపదలో ఉన్న పేద ప్రజలకు అండగా నిలుస్తూ వారి బాగోగులు చూస్తున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేద ప్రజల ఆశాజ్యోతి అని కిష్టాపురం ఎంపిటిసి భీమనపల్లి సైదులు అన్నారు. మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన ఈరటి సత్యనారాయణ అనారోగ్యానికి గురై ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మంజూరైన చెక్కులను శనివారం నందిపాటి రమేష్ లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు నరసింహ గౌడ్, కుంట్ల భీమారెడ్డి, వేముల యాదగిరి, గాలయ్య, సురేష్, సాయి, మహేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలుస్తున్న తెరాస రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి



**మునుగోడు, ఏప్రిల్ 30 (అక్షర వెలుగు):** మునుగోడు నియోజకవర్గం తెరాసా రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి నియోజకవర్గంలో ప్రజల కష్టాలను గుర్తించి తనదైన శైలిలో ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో బాదపడుతున్న కుటుంబాన్ని ఆర్థికంగా అదుకున్నారు. వివరాలలోకి వెళితే.. నారాయణపురం మండలం మహ్మదాబాద్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పరి ఉషయ్య, అతని కుమారుడు ఉప్పరి లింగస్వామిని పరామర్శించి ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో తెరాసా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# చలన చిత్రం

## వైవిధ్యమైన పాత్రల్లో విజయ్ సేతుపతి



ఒక వైపు స్టార్ హీరోగా కొనసాగుతూనే మరో వైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా, విలన్ పాత్రల్లో కూడా నటిస్తూ ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపును సంపాదించికున్న నటుడు విజయ్ సేతుపతి. పాత్ర నచ్చితే చిన్న సినిమాల్లో కూడా నటించడానికి సిద్దంగా ఉండే అతికొద్ది మంది నటులలో ఈయన ఒకడు. ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యాడు. 'ఉప్పెన'లో ఈయన పండించిన విలనిజంకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. 'మాస్టర్'లో కూడా ఈయన విలనిజంకు మంచి మార్కులు పడ్డాయి. ఈ క్రమంలో విజయ్ సేతుపతి ముచ్చటగా మూడో సారి విలన్ పాత్రలో నటించబోతున్నట్లు కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం. నయనతార బాయ్‌ఫ్రెండ్ విఘ్నేష్ శివన్, అజిత్‌తో ఓ సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. రాక్ స్టార్ అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో నటించడానికి మేకర్స్ విజయ్‌ను సంప్రదించారట. పాత్ర నచ్చడంతో విజయ్ వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'కణ్మణి రాంబో ఖతిజా' తాజాగా విడుదలై మంచి విజయం సాధించింది. ప్రస్తుతం ఈయన కమల్ హాసన్ హీరోగా నటిస్తున్న 'విక్రమ్' సినిమాలో కీలకపాత్రలో నటిస్తున్నాడు.

## కష్టాల్లోనే జాక్వెలిన్



సల్మాన్ ఖాన్ గర్ల్ ఫ్రెండ్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాక్విలిన్ ఫెర్నాడేజ్ కష్టాలు తీరలేదు. ఇటీవల ఆమెను ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ఓ కేసు విషయంలో సుదీర్ఘ సమయం విచారించింది. తాజాగా ఆమెకు చెందిన రూ. 7.27 కోట్ల రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది. రూ. 200 కోట్ల స్కామ్ లో సూత్రధారి అయిన సుకేశ్ చంద్రశేఖర్ ఇప్పటికే అరెస్ట్ అయ్యి ఊచలు లెక్కపెడుతున్నాడు. అతనితో సాన్నిహిత్యం ఉన్న శ్రీలంకకు చెందిన హీరోయిన్ జాక్విలిన్ ను ఈడీ అధికారులు పలుమార్లు ప్రశ్నించారు. తాజాగా ఆస్తులను అటాచ్ చేశారు. సుకేశ్ నుండి జాక్విలిన్ రూ. 5.71 కోట్ల విలువచేసే బహుమతులను తీసుకుందని ఈడీ విచారణలో తేలింది. మూడు డిజైనర్ బ్యాగ్స్, మల్టిపుల్ డైమండ్ జ్యూయలరీ సెట్, రెండు బ్రాస్లెట్స్, రూ. 52 లక్షల విలువ చేసే ఓ గుర్రాన్ని సుకేశ్ ఆమెకు గిఫ్ట్ గా ఇచ్చాడని తెలిసింది. అయితే? సన్ టీవీ అధినేతగా తనకు సురేశ్ పరిచయమని, తన బంధువులకు అతను భారీ మొత్తంలో బహుమతులు ఇచ్చాడని, తనకు ఓ గుర్రంతో పాటు కూపర్ కార్ ను గిఫ్ట్ ఇచ్చాడని జాక్విలిన్ గతంలోనే ఈడీ అధికారులు తెలిపింది.

## వెయ్యికోట్ల క్లబ్‌లో కెజిఎఫ్-2




ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కేజీయఫ్ 2 హవా ఇంకా కొనసాగుతూనే ఉంది. యశ్ హీరోగా, ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య ఏప్రిల్ 14న థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చి, అంతే భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. తొలి రోజే సూపర్ హిట్ టాక్ సంపాదించుకొని బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీని సృష్టిస్తోంది. బాలీవుడ్‌లో అయితే ఏ సినిమాకు సాధ్యం కాని వసూళ్లను రాబట్టి చరిత్ర సృష్టిస్తోంది. ఇప్పటికే హిందీలో రూ.350 కోట్లకు పైగా రాబట్టి.. ఆల్ టైమ్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రం మరో రికార్డును అందుకుంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం రూ.1000 కోట్ల కలెక్షన్లను వసూలు చేసింది. దంగల్, బాహుబలి 2, ఆర్ఆర్ఆర్ తర్వాత రూ. వెయ్యికోట్ల క్లబ్‌లో చేరిన నాలుగో చిత్రంగా 'కేజీయఫ్ 2' నిలిచింది. ఇక టాలీవుడ్‌లోనూ కేజీయఫ్ 2 ఇంకా తగ్గలేదు. 15 రోజుల్లో ఈ చిత్రం 77.31 కోట్ల షేర్‌ని రాబట్టింది. ఓ డబ్బింగ్ సినిమా ఇంత కలెక్ట్ చేయడం ఇదే తొలిసారి. గతంలో ఈ రికార్డు రజనీకాంత్ 'రోబో' పేరిట ఉండేది.పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా సంజయ్ దత్, హీరోయిన్‌గా శ్రీనిధి నటించారు. రవీనా టాండన్, ప్రకాశ్ రాజ్, రావు రమేశ్ కీలక పాత్రలు పోషించారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com